

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# ఆనవాళ్లను చెరిపేసే కుట్ర

- ప్రశాంత వాతావరణాన్ని అల్లకల్లోలం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ప్రభుత్వ కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు..
- దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, మే 29 : తెలంగాణ ఉద్యమంతో పెనువేసుకున్న బంధాలతో కూడిన ఆనవాళ్లను చెరిపేసే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరతీసిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలోని మాజీ మంత్రి నివాసంలో తెలంగాణ దశాబ్ది వేడుకలపై కార్యకర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఆవిర్భావ ఉత్సవాలను బీఆర్‌ఎస్ శ్రేణులు పల్లెలు, పట్టణాల్లో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పద్నాలుగేండ్ల ఉద్యమకాలంలో కేసీఆర్ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నిలిపారన్నారు. కేసీఆర్ చావునోట్లో తల పెట్టి బానిస పాలన నుంచి విముక్తి కల్పించారన్నారు. తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగఫలితాలను జూన్ 2న ప్రజలకు వివరించాలని కోరారు. దశాబ్ది వేడుకలను మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదేండ్ల తెలంగాణ అభివృద్ధి గుర్తులను కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తున్నదని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్ర గేయానికి ఆంధ్రా సంగీత దర్శకుడు కీరవాణితో సంగీతాన్ని సమకూర్చడం, కాకతీయ కళాతోరణాన్ని తొలగించి తెలంగాణ ప్రజలను అగౌరవపర్చే పరిస్థితికి తీసుకొస్తున్నదన్నారు. పదేండ్ల ప్రశాంత వాతావరణాన్ని అల్లకల్లోలం చేసే దిశగా సీఎం రేవంత్ అడుగులు వేస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర సర్కారు చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇలాగే కొనసాగితే మరో తెలంగాణ ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్, నాయకుడు కురుమూర్తియాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# ఐదు వారాలైనా ఉపాధి పైసలు రాలే..

- ఎండలో పోస్టాఫీస్ వద్ద బారులుదీరిన కూలీలు
- టెంట్ వేయించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, మే 29 : మండలకేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద ఉపాధి కూలీలు బుధవారం ఎండలో బారులుదీరారు. ఇది చూసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారి వద్దకు వెళ్లి ఎందుకు ఇక్కడ నిలబడ్డారని ప్రశ్నించారు. స్పందించిన ఉపాధి కూలీలు.. 'సార్ మేము ఉపాధి పనులు చేసి ఐదు వారాలవుతున్నా కూలి డబ్బులు ఇయ్యలేదు. ఎన్నిసార్లు అధికారులను అడిగినా వస్తాయని చెబుతున్నారే తప్పా.. ఇవ్వడం లేదు.. మీరు ఉన్నప్పుడు పింఛన్ వచ్చిందంటే చాలు ఆఫీసు ముందర టెంటు వేసెటోళ్లు. ఇప్పుడేమో ఎండల నిలబడి పింఛన్, కూలి డబ్బులు తీసుకుంటున్నాం'. అని సమాధానమిచ్చారు. స్పందించిన మాజీ మంత్రి కూలి డబ్బులు ఎందుకు రావడం లేదో తాను కనుక్కుంటానని కూలీలకు హామీ ఇచ్చారు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడే బాగుండే.. ఇప్పుడు చాలా తిప్పలైతుందని కూలీలు అనడంతో.. శ్రీనివాస్‌గౌడ్ వెంటనే ఆఫీసు ముందు టెంటు వేయించారు. దీంతో కూలీలు సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మహ్మద్ అనారోగ్యంతో మృతి చెందగా శ్రీనివాస్‌గౌడ్ నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకూ బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని.. ఎవరూ అధైర్య పడొద్దన్నారు. మహ్మద్‌కు పార్టీ నుంచి ఎలాంటి సహాయం వచ్చినా వెంటనే అందజేస్తామన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఏ ఆపద వచ్చినా కాపాడుకుంటామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానన్నారు. మాజీ మంత్రి వెంట ఎంపీపీ బాలరాజు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు అన్వర్, కొండా లక్ష్మయ్య, జంబులయ్య, మాధవులుగౌడ్, వెంకటేశ్, రాములు, బసిరెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జా

- ప్రహరీని ఏర్పాటు చేసిన జడ్చర్ల ఎమ్మెల్యే అనుచరుడు
- యథేచ్ఛగా మట్టి తరలింపు
- తూడి అనిల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి..
- కలెక్టర్, అధికారులకు ఎర్రకుంటతండా, చింతకుంటతండా వాసుల ఫిర్యాదు

బాలానగర్, మే 29 : మండలంలోని ఎర్రకుంటతండా శివారులో సర్వేనెంబరు 270/4/2/2/2లోని 2.03 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని ఎర్రకుంటతండా, చింతకుంటతండా వాసులు బుధవారం కలెక్టర్ రవినాయక్‌కు ఫిర్యాదు చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనుచరుడు తూడి అనిల్‌రెడ్డి సదరు విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా చదును చేసి ప్రీకాస్ట్ ప్రహరీని కూడా నిర్మించినట్లు తెలిపారు. సదరు పొలంలోని మట్టిని ఇతరులకు ఇష్టానుసారంగా విక్రయించినట్లు వివరించారు. ఈ విషయమై మైనింగ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అందులోని మట్టిని తరలిస్తున్న అనిల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నాగేందర్, రవి, శ్రీనివాస్, సేవ్యా, రమేశ్ తదితరులున్నారు.



మైనింగ్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు


## ప్లాస్టిక్ రహితంగా ఏటీఆర్..

- అదనపు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలి : సీఎస్ శాంతికుమారి

అమ్రాబాద్, మే 29 : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌ను జూలై ఆఖరులోగా ప్లాస్టిక్ రహితంగా మార్చాలని అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో అటవీ, పంచాయతీ, టీజీపీసీబీ, ఎండోమెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఏటీఆర్ ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని, అటవీ ప్రాంతంలో అదనపు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిజర్వ్ పరిధిలోని నాలుగు ప్రాంతాల ప్రజల తరలింపు ప్రక్రియలో వేగం పెంచాలని సూచించారు.

తెలంగాణ రాజముద్ర నుంచి కాకతీయుల కళాతోరణం, చార్మినార్‌ను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నడంతో రగడ రాజుకుంటున్నది. రాష్ట్రంలోని ఉన్న చారిత్రక ప్రత్యేకత, ప్రజలు మెచ్చేలా పరిపాలన సాగించిన కాకతీయుల స్ఫూర్తిని కొనసాగించేలా ఉండేందుకు వీలుగా కేసీఆర్ రాజముద్రలో కళాతోరణానికి స్థానం కల్పించారు. ఇప్పుడు సర్కారు అనాలోచిత నిర్ణయంతో చారిత్రక సంపదకు గుర్తింపు లేకుండా చేసే చర్యలకు పాల్పడుతున్నది. ఇలాంటి నిర్ణయాలు తెలంగాణ సంస్కృతికి తూట్లు పొడుస్తాయని, మన ఆత్మగౌరవం సైతం దెబ్బతింటుందని కవులు, కళాకారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ చర్యలు రాష్ట్ర సమాజానికి మంచివి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మే 29*



- కాకతీయ కళాతోరణం, చార్మినార్ తొలగింపునకు సర్కారు కుట్ర !
- తెలంగాణ సంస్కృతికి తూట్లు పొడిచేలా కాంగ్రెస్ చర్యలంటూ ఆగ్రహం
- సీఎం రేవంత్‌పై కవులు, కళాకారులు, ప్రజల కన్నెర్ర
- ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే యత్నమంటూ ఆవేదన

# రాజముద్రపై రగడ

## తెలంగాణ నేల సహించదు..



రాచరిక చిహ్నాలంటూ రేవంత్‌రెడ్డి తన ముద్రను ఉంచుకోవాలనుకుంటున్నడు. ఇది రెడ్డి పరిపాలన కాదు.. తెలంగాణ పరిపాలన. కాకతీయ తోరణం, చార్మినార్ సాంస్కృతిక వైభవానికి చిహ్నాలు. ఆనాడు రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఎన్నో సమావేశాలు నిర్వహించి తీసుకున్నటువంటి అద్భుతమైన కళాఖండం. తెలంగాణ నేలలో పాటలు, జానపదాలు, సంగీతానికి కొదువలేదు. ఎందరో రచయితలు, సంగీత కళాకారులున్నారు. సాయుధ పోరాటంలో రాచరిక పాలనకు విముక్తి ఆనాటి పాటలు. దుర్మార్గపు పాలనను గద్దె దించినటువంటి ఎన్నో ఉద్యమ గేయాలు, పాటలు పుట్టలకొద్దీ ఉన్నాయి. మన పాటకు మన బాణి తెలంగాణ ఆత్మగౌరవం కాని.. ఇంకా వలసాంధ్ర సంగీతకారులతో పాట పాడించుకునే దుస్థితిలో తెలంగాణ గాయకులు లేరు. దీనిని తెలంగాణ నేల సహించదు. ఈ రోజు గుర్తులను మార్చినోడు.. రేపు ఊరును మార్చుతడు.. రాష్ట్రాన్ని మార్చుతడు.. ఆంధ్రప్రదేశ్‌కు పచ్చజెండా ఊపుతూ లోగోలను మార్చడం ప్రజాపాలన కాదు.. దుర్బుద్ధికి తార్కాణం.

*- వనపట్ల సుబ్బయ్య, కవి, రచయిత, నాగర్‌కర్నూల్*






## ప్రభుత్వం పునరాలోచించాలి..

భాష, ఆచార సంప్రదాయాలకు తలమానికంగా చరిత్రలో తెలంగాణ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నది. వీరవనిత రుద్రమదేవి శౌర్యానికి ప్రతీకగా కాకతీయుల కాలం నాటి తోరణం, గోల్కొండ నవాబుల కాలంలో భిన్న సంస్కృతులకు నిలయంగా హైదరాబాద్‌లో చార్మినార్‌ను నిర్మించారు. భవిష్యత్తు తరాలకు తెలంగాణ ప్రాంత పూర్వీకుల చరిత్ర తెలిసేలా, సంస్కృతికి అద్దం పట్టేలా చారిత్రక కట్టడాలను నిర్మించారు. మన సంస్కృతికి అద్దం పట్టేలా నిర్మించిన కట్టడాలను దృష్టిలో ఉంచుకొని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర లోగోను ఏర్పాటు చేసింది. మన సంస్కృతికి ప్రతీకగా శాతవాహనులు, కాకతీయులు, బహుమనీయులు, కుతుబ్‌షాహీలు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబులు పాలించిన కాలంలోని అంశాలను భవిష్యత్తు తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాభిప్రాయం మేరకు లోగోను రూపొందిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సంస్కృతికి తూట్లు పొడుస్తూ.. సంప్రదాయాలను మట్టిపాలు చేస్తున్నది. ఉద్యమకారుల బలిదానాల మీద ఏర్పడిన రాష్ట్ర లోగోను మార్చే విషయాన్ని ప్రభుత్వం పునరాలోచించాలి. రాజకీయాలకతీతంగా నిర్ణయాలు తీసుకోవాలి.

*- ఈవీవీ శెట్టి, సాహితీవేత్త, వికాసభారతి జిల్లా అధ్యక్షుడు, జోగుళాంబ గద్వాల*

## రాష్ట్ర ఖ్యాతిని ప్రతిబింబించేలా ఉండాలి..



చార్మినార్, కాకతీయ తోరణాలు రాష్ట్రంలోనే కాకుండా జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన చారిత్రక కట్టడాలు. గత పాలకులు కష్టజీవులు, కార్మికులు, ఉద్యమకారుల కష్టసుఖాలను ప్రతిబింబించేలా లోగోను తయారు చేశారు. ఒక వ్యక్తిని, ఒక ప్రాంతాన్ని తక్కువ చేసేలా లోగోను రూపొందించొద్దు. ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. అంతేకానీ ఐదేండ్లకోసారి మారే పాలకుల సొంత నిర్ణయాలపై లోగోలు మార్చడం సరైన పద్ధతి కాదు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను ప్రతిబింబిస్తూ.. రాష్ట్ర ఖ్యాతిని పెంచే విధంగా, రాజకీయాలకతీతంగా లోగో మార్పుపై నిర్ణయం తీసుకుంటే బాగుంటది.

*- సంధ్యపోగు ఆశన్న, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి, అలంపూర్*



మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ధాన్యం

- మార్కెట్ అధికారులు, వ్యాపారస్తుల కుమ్మక్కు
- ధాన్యం అమ్మకం కోసం రైతుల పడిగాపులు
- కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు అనాసక్తి
- బాధ్యతలు కలెక్టర్లకు అప్పగించిన ప్రభుత్వం
- అయినా కేంద్రాలను తనిఖీ చేయని వైనం
- సమీక్షలతో కాలం వెల్లదీత

# సన్న వడ్లకు మద్దతు కరువు!

మహబూబ్‌నగర్, మే 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సన్న వడ్లకు మార్కెట్‌లో గిట్టుబాటు కంటే ఎక్కువ ధర లభిస్తున్నా వ్యాపారస్తులు, మార్కెట్ అధికారులు కుమ్మక్కు అయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వేలాది టన్నుల ధాన్యం అమ్మడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మేజర్ మార్కెట్లకు సన్న వడ్లు భారీగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో ధాన్యం రేటు రోజు రోజుకూ తగ్గేలా చేస్తున్నారు. గత వానకాలం సీజన్‌లో సన్న వడ్లకు రూ.3,300 అత్యధిక ధర పలికింది. ఈసారి కూడా రూ.3,150 ధర ఉన్నప్పటికీ వ్యాపారస్తులు సాకులు చెబుతూ తగ్గిస్తున్నారు. ఫలితంగా మార్కెట్లను ధాన్యం రాసులు పేరుకుపోతున్నాయి. ఒక్క జడ్చర్ల మార్కెట్‌లోనే సుమారు 5,000 క్వింటాళ్ల ధాన్యం అమ్మకానికి వచ్చింది. బుధవారం గ్రేడ్-1 ధాన్యానికి రూ.2,680 పలికింది. కానీ ప్రభుత్వం రూ.2,180 మద్దతు ధర ఇవ్వడంతో రైతాంగం మొత్తం బహిరంగ మార్కెట్ వైపు మొగ్గు చూపుతోంది. ఇటీవల ప్రభుత్వం కొనుగోళ్ల బాధ్యతను జిల్లా కలెక్టర్లకు ఇచ్చినా మార్కెట్లోకి వస్తున్న ధాన్యం మాత్రం తమ పరిధిలోకి రాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. కేవలం సమీక్షలతోనే కాలం గడుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో ధర ఉన్నప్పటికీ ఇటు వ్యాపారస్తులు.. అటు మార్కెట్ అధికారులు కుమ్మక్కు కావడంతో ధరలు తగ్గిస్తూ రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. మరోవైపు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు టెండర్లు వేసి కొనాల్సిన వ్యాపారస్తులు కాలయాపన చేస్తుండడంతో వర్షాలు పడి మార్కెట్లల్లో ఉన్న ధాన్యం మొత్తం తడిసి ముద్దవుతుంది. తిరిగి ఆరబెట్టి అమ్ముకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారి.. సన్న వడ్లకు ధర లభించక రైతాంగం గోసపడుతోంది.

### సన్న వడ్ల కొనుగోళ్లలో మాయాజాలం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వ్యాపారస్తులు, మార్కెట్ అధికారులు కుమ్మక్కు కావడంతో బహిరంగ మార్కెట్‌లో లభిస్తున్న మద్దతు ధర గగనమైపోయింది. ఇటు వ్యాపారస్తులు అందరూ సిండికేట్‌గా మారడంతో గరిష్ఠ స్థాయికి చేరిన గ్రేడ్-1 ధాన్యానికి ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లకు వచ్చిన ధాన్యాన్ని ప్రతిరోజూ పరిశీలించి వ్యాపారస్తులకు కమ్యూనికేట్ చేసి కొనుగోలు చేయించే బాధ్యత మార్కెటింగ్ శాఖ అధికారులకు ఉన్నా వారంతా వ్యాపారస్తులకు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా మార్కెట్లను వచ్చిన ధాన్యానికి గరిష్ఠ ధర ఇవ్వకుండా దగా చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.3,100 పలుకుతున్న ధరలు కాదని రూ.2,680 చొప్పున తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో అత్యధిక ధర పలుకుతుంటే సీఎం సొంత జిల్లాలో మాత్రం వ్యాపారస్తులు, అధికారులు కుమ్మక్కై రోజురోజుకూ ధరలు తగ్గిస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ధాన్యం తడిసిపోతుండడంతో కనిష్ఠ స్థాయికి ధరలు పలుకుతున్నాయి. ఇక మార్కెట్లలో ఆరబెట్టుకొని అమ్ముకుందామంటే వసతులు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు..**

వనపర్తి జిల్లాలో 242 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 64,247.2 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 202 కొనుగోలు కేంద్రాల ద్వారా 34.381.2 మెట్రిక్ టన్నులు, నారాయణపేట జిల్లాలో 107 కేంద్రాల ద్వారా 2187.02 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 70 కేంద్రాలు ప్రారంభించి 9 కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ఇప్పటి వరకు 2687.440 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 110 కేంద్రాలు ఏర్పాటు చేసి 19,428.400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించారు.

**మార్కెట్ల వైపు కన్నెత్తిచూడని కలెక్టర్లు**

ఉమ్మడి జిల్లాలోని రైతులకు, వ్యాపారస్తులు సరైన ధర ఇవ్వకుండా మోసం చేస్తున్న విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ధాన్యం కొనుగోలు.. అమ్మకాల బాధ్యతను కలెక్టర్లకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అయితే ఇప్పటికే ఆయా జిల్లాల పరిధిలో కొనుగోలు కేంద్రాల ద్వారా 90 శాతం వరకు వచ్చిన ధాన్యాన్ని కొనేశారు. కానీ సన్న వడ్లు మాత్రం ధర బహిరంగ మార్కెట్లో ఎక్కువ ఉండటంతో రైతులు ఆశగా మార్కెట్లకు తరలిస్తున్నారు. కాగా మార్కెట్లో ధాన్యం కొనుగోలు చేయకుండా వ్యాపారస్తులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. అయినా కలెక్టర్లు మార్కెట్లను తనిఖీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. సీఎం సొంత జిల్లాలోనే రైతులను దగా చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

## ఆకాశాన్నంటుతున్న బియ్యం ధరలు

బియ్యం ధరలు ఆకాశంలో ఉన్నాయి. మేము పండించిన పంటకు మాత్రం సరైన ధర రావడం లేదు.. కిలో సన్న బియ్యం రూ.60 ధర పలుకుతుంది. సూపర్ మార్కెట్లలో రూ.70 ఉన్నది. ఆరుగాలం కష్టపడి పండించి మార్కెట్‌కు విక్రయించేందుకు తీసుకెళ్తే క్వింటాకు రూ.2,600 మాత్రమే చెల్లిస్తున్నారు. మాకు చాలా నష్టం కలుగుతుంది. పంటలు కోయగానే ఆరబెట్టి తీసుకెళ్లిన కొనుగోళ్లకు టైం తీసుకుంటున్నారు. వర్షాలు మమ్మల్ని వెంటాడుతున్నాయి. ఇప్పటికైనా సన్న వడ్లకు మంచి ధర ఇచ్చి కొనుగోలు చేయాలి.

*- గౌని చెన్నయ్య, రైతు, మహబూబ్‌నగర్*